ఆధోజగత్తు:

# పునర్జన్మ

■ పోలవరపు వెంకటరత్నం ■

రంగడు కుక్కిమంచంలోపడి అమిత బాధపడుతున్నాడు. తండ్రి పిడిగుద్దుల్తో శరీరమంతా హూనాహూనమై పోయింది. ముక్కునుంచి కారిన రక్తంతో నేలంతా తడిసిపోయింది. ఇంకా కొద్ది కొద్దిగా చెమరుస్తూనేవుంది శరీరంలో పోటు పుటుతోంది. శారీరకబాధకంటె మానసిక బాధయింకా ఎక్కువగాపీడిస్తోంది తనమూలంగా తన తల్లికూడ తండ్రి ఆగ్రహానికి గురైంది. ఆమె ముఖంకూడ దెబ్బల్తో కమిలి పోయింది. అసలిదంతా ఎందుకు జరిగింది? తనతల్లి దెబ్బలు ఎందుకు తింది? ఆ తప్పు తనెందుకు చెయ్యాల్సివచ్చింది? దీనికింతకీ కారణం తనేగా! కమిలి పోయిన తల్లి ముఖం వాడిగుండెల్ని శూలాల్తో పొడుస్తోంది. ఆనాడు జరిగిన సంఘటనలన్నీ ఒక్కొక్కటే కళ్ళముందుకు రాసాగినయి.

ప్రొద్దున్నే బజారునుంచి వస్తున్నాడు. వెంట తన కుక్కకూడవుంది. అదొక అస్థిపంజరం. ఏనాడూ కడుపునిండా తిండి తిన్నట్టు కనబడదు. అసలు వాడుతింటేగా? అది తినడం వాడికై కేటాయించబడ్డ తిండిలో సగంభాగం దానిది. ఫలితం యిద్దరూ అర్ధాకలితో మాడడం. తన కడుపు ఆకలితో మండిపోతున్నా దానికి పెట్టకుండా వాడు తినలేడు. తనకు తిండి లేకపోయినా పీడ్ని వదలి అదివుండలేదు. వాళ్ళిద్దరి స్నేహం అలాటిది. ఏ పూర్వానుబంధమో మరి అది?

దారిలో ఒక మహానుభావుడు ఒకయింటి అరుగుమీద కూర్చుని తీరిగ్గా జిలేబి తింటున్నాడు. కుక్క తొందర తొందరగా ఆయనదగ్గరికి పరుగెత్తింది. ఎక్కడ పొట్లాంమీద పడుతుందో నని గబుక్కున లేచి కుక్కని రంగడ్ని నానాతిట్లూ తిట్టసాగాడు. అప్పుడు తనునమ్రతగా.

"ఎందుకండీ, అలా తిడతారు? ఒక్క ముక్క దానిముందు పారేస్తే...." ఇంకా తన మాటన్నా పూర్తికాలేదు. ఆయన వుగ్రుడై పోయి "ఏడిశావ్‌లే, నోరుమూయి వెధవా! తనకోటి గతి లేదు మెడకో డోలట! బయలుదేరావ్, ఒక దరిద్రపు కుక్కను వెంటబెట్టుకుని'' అన్నాడు.

అప్పుడు తనకు అరికాలిమంట నెత్తికెక్కింది.

"బయలు దేరావు లేవయ్యా మహాషావుకారివి. ఎట్లాగయితే కొన్నావ్ మహాజిలేబి. అంతయిదివున్నవాడవయితే ఎక్కడన్నా చాటుగా కూర్చుని తినలేకపోయావ్?" నడి బజార్లో దుకాణం పెడితే దగ్గరకు ఏకుక్కా రాకుండా వుంటుందా?'' అని జాడించి కుక్కను తీసుకుని ముందుకు సాగాడు తను.

వేలెడులేని వెధవకి ఎంత పొగరో చూడు! అని గుటుక్కున మింగాడు మిగిలివున్న జిలేబిని ఆ మహాత్ముడు!

బజార్లో నడుస్తున్నాడు- తనుకుక్కతో సహా యింటివైపుకు. ఇంతలో వెనుకనుంచి బుర్ మంటూ ఒకకారు దూసుకు పోయింది. అందులో తలబైటికి పెట్టి తొంగి చూస్తున్న తెగబలిసిన తెల్లబొచ్చు కుక్క తన్నీ తనకుక్కనీ చూచి

'టా' మంది కారు హారన్ తోపాటు. ఇంత వెడల్పు రోడ్డువుండగా తన వక్కనుంచే దూసుకుపోవాలీ యీ కారు? ఎందుకో మరీ అంత పొగరు యీ కార్లకి. ఆకుక్క చూడరాదూ ఎంత మిడిసి పడిందో? కొన్నికుక్కలు అలాకార్లో ఎక్కి దర్జాగా తిరుగుతోంటే కొన్ని కుక్కలకు ఎంగిలి మెతుకులు కూడాలేవు ఎముకల పోగులైపోవడానికికారణమేమిటో ఎంత ఆలోచించినా తనకర్థం గాలా, ఏమిటో ఆలోచించుకుంటూ యింటికి చేరాడు. కుక్కను యథాస్థానంలో కట్టేసి దాని కాయాన్ని నిమురుతూ,

"జిలేబీ కావాలానీకు? వెధవ జిలేబీ! యివ్వాళ మనం హల్వాతెచ్చుకొని తిందాము. నా మాట నమ్మవూ'' అన్నాడు ఆప్యాయంగా. కుక్కతన్ను విశ్వసించినట్టుగా చెవులు జాడించి తన పాదాల్ని నాకింది. సంతృప్తిగా యింట్లోకెళ్ళి రెండు మెతుకులు తిని రెండు మెతుకులు దానికి పెట్టి వుత్సాహంతో కాఫీహోటల్ వైపుకు ప్రయాణమయ్యాడు

హోటల్ యజమాని లోపలికి పోయినపుడు డ్రాయరులో నుంచి ఒకరూపాయితీసి జేబులో పెట్టాడు. ఆపని చేయడం ఆతనికెంతో బ్రహ్మాండమైపోయింది. గుండెలు దడదడలాడినై. కాళ్ళుచేతులు వణికిపోయినై. కాని కుక్కకుచేసిన వాగ్దానం తనని ముందుకు తోసింది. ఎవ్వరి కంటా బడకుండా తనాపని చేయగలిగానని అనుకున్నాడు. కాని వంటికన్నురాముడి దృష్టినుంచి తప్పించుకోలేక పోయాడు. వాడు తన్ను చూసింది తనూ చూచాడు. అప్పుడు తనకి గంగిర్లెత్తిపోయినై. తొందరగా బైటికిపోయి రూపాయిని ఒక గోడకంతలోపెట్టి ఏమీ యెరుగనట్లేవచ్చి కప్పులులాగి బల్లల్ని తుడుస్తున్నాడు. యింతలోనే యజమానివచ్చి తనచెవి పట్టుకున్నాడు. తనచేతిలోవున్న కప్పుజారి క్రిందపడింది. యజమానిచెయ్యి తన చెంపమీద ఛెళ్ళుమంది. తన కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగినయి.

"ఏదిరా రూపాయి?" కర్కశ స్వరంతో గద్దించాడు యజమాని.

"నేను తీయలేదండి'' ఏడుస్తో అన్నాడు తను.

"అబద్ధమాడావంటే దొక్కచీలుస్తా నిజం చెప్పు" మళ్ళీ అరిచాడు. తను సమాధానంచెప్పలా. గుడ్డిరాముడి చేతులు తనజేబులన్నీ వెదకినయి ఖాళీ చేతులే బైటికి వచ్చినయి.

"ఎక్కడ దాచావో చెబుతావా, చెప్పవా"? యజమాని కంఠస్వరం. చెప్పేద్దామనుకున్నాడు. కాని తను కుక్కకుచేసినవాగ్దానం తన్ను వారించింది. బావురుమని ఏడ్చాడు.

"ఛో, వెధవా! నీవు పనిలో అక్కరర్లేదు" అనిబైటికి తోసేశాడు యజమాని.

అప్పుడు తను రూపాయి తీసుకుని మిఠాయి దుకాణానికి పోయాడు, హల్వాకొని ఇంటివైపు పరుగెత్తాడు, కుక్క తనకోసమే లేచివున్నట్లుగా చూస్తోంది. తన్నుచూసి ముందుకాళ్ళు నేలనేసి రాయడం మొదలెట్టింది. ఉత్సాహంతో దాని ముందుకు పోయి హల్వా నోటికందించాడు. హల్వా అంతా తినేసి తనకాళ్ళను నాకసాగింది. దానివీపు నిమురుతున్నాడు తను, ఇంతలో నాన్న వచ్చాడు. లోపలికి పోయి రంగా! అని పిలిచాడు.

ఆ కేకలోనే ఏదో కర్కశత్వం కనిపించింది తనకు, తనగుండెలు వేగంగాకొట్టుకోసాగినయి. మెల్లగా యింట్లోకి నడిచాడు, ఎదురుగా నాన్న భయంకరరూపం ప్రత్యక్షమయింది. చేతిలో ఒక తాడువుంది. నిప్పులు కక్కుతున్నయికళ్ళు నాన్న వంక చూడలేక పోయాడు.

"దొంగతనం కూడనేర్చావటరా గాడిదా !" ఒక పొలికేక. తాడు తనవీపుమీద ఛెళ్ళుమంటూ మ్రోగింది.

" అమ్మా !" అని అరచాడు తను.

దెబ్బమీద దెబ్బ, ఇంతలోనే అమ్మ వచ్చి అడ్డంపడింది. చేతిలో తాడులాగుంది, ఇకనాన్న

పిడికిలి బిగించాడు. ఒక్క గుద్దుగుద్దాడు. తను క్రిందపడిపోయాడు. ఇంకాగుద్దుతున్నాడు నాన్న. తనశరీరం బ్రద్దలైపోతోంది. "అమ్మో" "అమ్మో" అని అరుస్తున్నాడు తను.

"నాకడుపున చెడపుట్టావ్ దరిద్రుడా. నాపరువు నాశంచేశావు." అరిచాడు నాన్న. ఈసారి గుద్దు ముక్కు మీదపడింది. ముక్కులోంచి రక్తం ప్రవాహంలాగ పైట కొచ్చింది. మళ్ళా లేచింది నాన్న పిడికిలి.

"అమ్మో! నాకొడుకు చచ్చిపోయాడు" అంటూ అమ్మ తన మీదపడింది. నాన్న పిడికిలి అమ్మ ముఖాన్ని తుమలబొడిచింది. "అబ్బా" అని మూలిగింది అమ్మ

'చావండి! నువ్వేవాడ్ని దొంగనుచేశావ్....' నోటికొచ్చినట్లల్లా తిట్టి శాంతించాడు నాన్న. అప్పుడు తన్ని మెల్లగా తీసుకొచ్చి యీ కుక్కి మంచంలో పడేసింది అమ్మ.

ఇంతకీ తనవల్ల నాన్న పరువు పోయింది. తనకు కాఫీహోటల్లో కప్పులు కడిగే నౌఖరీసంపాదించి పెట్టిన నాన్న పరువు గంగలో కలిసిపోయింది. అమ్మ ముఖం ఎర్రగా నెత్తురు చిమ్ముతోంది. తన శరీరంనిండా వాతలు తేలినై. ఇదంతా జరిగింది తనకారణంగా!

"ఇట్లా తిరుగు బాబూ!" వాడి ఆలోచనలు ఆగిపోయినై. తిరిగాడు అమ్మవైపుకు. చేతిలో వేడినీటిలో ముంచినగుడ్డ. కళ్ళలోనుంచి నీళ్ళు కారుతున్నయి. ముఖమంతా వాచిపోయింది, రంగడి కళ్ళుకూడా అశ్రుపూరితాలైనై. తనతల్లి దెబ్బలు తినికూడ తన దెబ్బలు లెక్కచేయకుండా ముందు తనకు చేయటానికి వచ్చి తన స్థితిని చూచి కన్నీళ్ళుకారుస్తున్న అమ్మను బాధించినందుకు వాడి గుండె చెరువైంది. తన చేతుల్తో అమ్మ కన్నీళ్ళు తుడుస్తూ,

"ఇంకెప్పుడూ దొంగతనం చెయ్యనమ్మా" అని బావురు మన్నాడు, వాణ్ణి హృదయానికి హత్తుకుని వాడినెత్తిమీద కన్నీటి వర్షం కురిపించింది.

మళ్ళీ నాలుగు రోజులికి అదే హోటల్లో వాడు కప్పులు కడుగుతున్నాడు. నాన్నకున్న పరువు మళ్ళీ అదే స్థానాన్ని వాడికిప్పించేందుకు కొంచం శ్రమపడింది. ఇకనైనా బుద్ధిగా మెలగమని, యీసారి ఏమైనా జరిగిందంటే చంపేస్తానని నాన్న తీవ్రంగా హెచ్చరించాడు. కాని రంగడి దురదృష్టం!! ఆనాడే యజమాని డ్రాయరులో ఒక పావలా మాయమయిందని ప్రకటించాడు. అందరి చూపులు రంగడిపైకి ప్రసరించినయి. దొంగ రంగడే తీసుంటాడని అందరూ ఏక గ్రీవంగా తీర్మానించారు. రంగడికి ముచ్చెమటలుపోసినయి. శరీరమంతా కంపించి పోతోంది. ఏడుపువస్తోంది.

"ఏరా, రంగా!' మార్పులేని యజమాని కఠినస్వరం.

"నేను తీయలేదు బాబూ!" ఏడ్చాడు రంగడు.

"నీవు తియ్యక పోతే రెక్కలొచ్చినయ్యా పావలాకి ఎగిరి పోవడానికి" అన్నాడు యజమాని. వీడు తప్ప యింకెవరూ దొంగలు తన హోటల్లో లేరని నిర్ణయంచేసుకున్నాడు యజమాని.

"ఒకదేచెయ్యి తిరిగే కాలు వూరుకుంటుందా?" అన్నాడో సర్వర్.

"అలవాటైన ప్రాణం అటో, యిటో అని" అన్నడు మరోవతను. కాని జాలి గొల్పే రంగడి ముఖాన్నిచూచి ఎవరూ సానుభూతి చూపలేదు. "పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణసంకటం" అన్నట్లుగా తలోమాట అని వాడ్ని మరీ ఏడిపిస్తున్నారు. రంగడి గుండెలు దుఃఖంతో బరువెక్కిపోయినై.

"నిజంగా నేను తియ్యలేదు బాబ్బూగారూ! నన్ను పనిలోనుంచి వెళ్ళగొట్టకండి" అని బావురుమంటూ యజమాని కాళ్ళు పట్టుకున్నాడు.

"ఏడిశావ్‌లే, కట్టబెట్టవోయ్ నీవేషాలు! దొంగతనంచేసేవాడి చెయ్యూరుకుంటుందా? యివ్వాళ రూపాయలు, పావలాలు! రేపు అసలుకే ఎసరెడతావు, పో. పోరా!" అని గదిమింది యజమాని రాతిగుండె కాని రంగడు ఏడుస్తూ యజమాని కాళ్లు వదలలా "పిడ్ని బైటికి యీడ్వండిరా" అన్నాడు, ఇంకేముంది? ఎంగిలిమెతుకులు తినే వెధవలంతా యీగల్లాగ మూగరు. గుడ్డిరాముడు వాడ్ని మెడబట్టుకు బైటికి గెంటాడు

రంగడికి ఏమీతోచక సాయంత్రం వరకూ బరువెక్కిన హృదయంతో ఎక్కడెక్కడో తిరిగాడు. ప్రొద్దుకూకేసరికి ఇంటికి చేరాడు తనకు తెలియకుండానే. అమ్మ తొందర తొందరగా స్నానం చేయించింది. అన్నంపెట్టింది తిన్నాడు. కుక్కిమంచంలో పడ్డాడు

కాసేపటికి నాన్న పొలికేక వినిపించింది. "రంగా!" ఉలిక్కిపడ్డాడు, కళ్లు గట్టిగా మూసుకున్నాడు. దగ్గరకొచ్చిన నాన్నపాదాల చప్పుడు వినిపించింది. "రంగా!" వాడు కళ్లుయింకా గట్టిగా మూసుకున్నాడు.

"సరే, పడుకో, తెల్లారనియి, నీపని!" అని వెనక్కి తిరిగాడు నాన్న. "బ్రతికానురా భగవంతుడా!" అనుకున్నాడు. కాని 'వెంటనే తెల్లారనియ్యి' అనే శబ్దం వాడిచెవుల్లో గింగురుమని మ్రోగింది, వాడి మనస్సు తీవ్రమైన కల్లోలానికి గురయ్యింది. పావలా తను తీయలేదన్నా నమ్మడు నాన్న. వెనకటి సంఘటనలు జ్ఞాపక మొచ్చినయి. తాడుచేత్తో పుచ్చుకుని నాన్న భయంకర స్వరూపం నిప్పులుకక్కే కళ్లు, తనవంటినిండా వాతలు గుద్దులు, పిడిగుద్దులు, అమ్మకిదెబ్బలు, అమ్మ కన్నీళ్లు, అమ్మో! ఇక అమ్మపడే బాధను భరించలేదతను. తనవల్ల మళ్ళా అమ్మ ఎన్నోదెబ్బలు తినాల్సి వస్తుంది. మళ్లీనేను దొంగతనంచేశానని అమ్మ ఎంతబాధ పడుతుందో! నేను తియ్యలేదని చెప్పినా ఎవ్వరూ నమ్మరు. ఒక్కసారి దొంగతనం చేయగానే దొందరంగడ్నై పోయాను. నన్నెవ్వరూ నమ్మరు. అమ్మకూడానా? ఛా.... అమ్మకన్నీ తెలుసు. అమ్మనామాట తప్పకుండా నమ్ముతుంది. అయినా అమ్మకి బాధ తప్పదుగా. ఈ సారి అమ్మని బాధ పెట్టకూడదు. మరేం చేయాలి? ఏదో ఆలోచన తట్టింది వాడి ముఖంలో ఏదో అవ్యక్తానందం మెరిసింది. ఏదో దృఢమైన నిశ్చయం చేసుకున్నట్లు, ఆనిశ్చయం వాడికెంతో సంతోషంగా వున్నట్లు వాడి ముఖం మీదనున్న చిరునవ్వు తెలుపుతోంది.

తెల్లవారింది. కుక్క విసుగులేకుండా మొరుగుతోంది. కాదుకాదు, ఏడుస్తోంది. మెడనున్న తాడు తెంపుకోడానికి తెగకొరుకుతోంది. కాళ్ళతో నేలను అదేపనిగా బరుకుతోంది. ఎదురుగా గోడమీద రంగడిశవం వ్రేలాడుతోంది. శిథిలమైపోయిన ఆ గోడలో ఒక కిటికీవుంది, ఆకిటికీకి తాడు బిగించి తనమెడకు వురిపోసుకున్నాడు రంగడు. గోడమీద మసి బొగ్గుతో రంగడు రాసుకొన్నాడు.

"అమ్మా! నేను పావలా దొంగతనం చెయ్యలేదు. నాన్నని వెళ్లి హోటలు వెధవతో చెప్పమను. వచ్చేజన్మలో నేనూ నాకుక్కా కారులో వెళతాము"

రంగడితల్లి గుండెబాదుకొని ఏడుస్తూ మొహం తిరిగి పడిపోయింది. తండ్రి బావురుమని ఏడుపు ప్రారంభించాడు. కుక్కరోదంతో ఘనభోంతరాళాలు దద్దరిల్లి పోయాయి.